క్లుప్తంగా

సాక్షి గణపతికి విశేష పూజలు


సాక్షిగణపతి

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో లోకకల్యాణార్థమై బుధవారం సాయంత్రం సాక్షి గణపతి స్వామికి అభిషేకం, జ్వాలా వీరభద్ర స్వామికి విశేష పూజలు నిర్వహించారు. సాక్షి గణపతికి పంచామృతాలతోను, ఫలోదకాలతోను, హరిద్రోదకం, గంధోదకం, పుష్పోదకం, కలశోదకం, శుద్ధజలంతో అభిషేకం చేసి విశేషపుష్పార్చన, నివేదన కార్యక్రమాలను చేపట్టారు. అలాగే జ్వాలా వీరభద్రస్వామివారికి అభిషేకం, విశేష పుష్పార్చన జరిపించారు.

గొర్రెల కాపర్లను ఆదుకోవాలి


మాట్లాడుతున్న కేవీపీఎస్ జిల్లా అధ్యక్షురాలు రంగమ్మ

పగిడ్యాల: ఐదు రోజుల క్రితం ప్రమాదవశాత్తు పంట కాల్వలో పడి మృతిచెందిన 200 జీవాల యజమానులకు ఆర్థిక సాయం మంజూరు చేసి ఆదుకోవాలని కేవీపీఎస్ జిల్లా అధ్యక్షురాలు రంగమ్మ డిమాండ్ చేశారు. బుధవారం ఆమె మాట్లాడుతూ తెలంగాణ నుంచి పగిడ్యాల మండలానికి వలస వచ్చిన గొర్రెల కాపర్లు ఇటీవల ప్రమాదంలో 200జీవాలు నష్టపోవాల్సి వచ్చిందన్నారు. ఆయా కుటుంబాలను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. అనంతరం కేవీపీఎస్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో గొర్రెల కాపర్లు జయమణి, నిరంజన్, మోహన్, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైద్యశాలలో సాధారణ ప్రసవం


గర్భిణులకు సూచనలిస్తున్న డాక్టరు శ్వేత

నందికొట్కూరు: ప్రభుత్వ వైద్యశాలలో సాధారణ ప్రసవాలు చేయనున్నట్లు స్త్రీ వైద్య నిపుణులు డాక్టర్ శ్వేత తెలిపారు. బుధవారం ప్రభుత్వ వైద్యశాలలో సాధారణ ప్రసవాలపై గర్భిణులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సాధారణ ప్రసవాలే తల్లీ బిడ్డకు మంచిదన్నారు. సహజ ప్రసవం కావాలంటే గర్భిణులు సమతుల ఆహారం తీసుకోవాలన్నారు. సరైన వ్యాయామం ద్వారా సులభంగా ప్రసవించే అవకాశం ఉంటుందన్నారు. వైద్యుల సూచనలు తప్పని సరిగా పాటించాలన్నారు. శిశువుకు తల్లి పాల ద్వారా శక్తివంతమైన రోగనిరోధక శక్తి లభిస్తుందన్నారు. కార్యక్రమంలో హెడ్ నర్సు భువనేశ్వరి, స్టాఫ్ నర్సు సుప్రియ పాల్గొన్నారు.

వక్ఫ్ బోర్డు చట్ట సవరణ బిల్లు రాజ్యాంగ విరుద్ధం



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

నందికొట్కూరు: వక్ఫ్ బోర్డు చట్ట సవరణ బిల్లు రాజ్యాంగ విరుద్ధమని సీపీఎం నాయకులు నాగేశ్వరరావు అన్నారు. బుధవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వక్ఫ్ బోర్డు చట్ట సవరణ బిల్లును వెంటనే ఉప సంహరించుకోవాలన్నారు. మసీదు భూములను స్వాధీనం చేసుకునేందుకు కేంద్ర ప్రభుత్వం వక్ఫ్ బోర్డు చట్ట సవరణ బిల్లు పార్లమెంట్‌లో ప్రవేశపెట్టడం ఎంత వరకు సమంజసమన్నారు. వక్ఫ్ బోర్డు ఆస్తులను పేద ముస్లింలకు పంచిపెడతామని చెప్పడం హాస్యాస్పందంగా ఉందన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు గోపాలకృష్ణ, ఉస్మాన్‌బాషా, బాలస్వామి, అబ్దుల్ రషీద్ పాల్గొన్నారు.

మెరుగైన సేవలు అందించాలి


మాట్లాడుతున్న స్పెషల్ ఆఫీసర్ మురళీకృష్ణ

మహానంది: ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని మండల స్పెషల్ ఆఫీసర్, జిల్లా వ్యవసాయ అధికారి మురళీకృష్ణ తెలిపారు. ఎం.తిమ్మాపురంలోని మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం గృహనిర్మాణాలపై సమీక్ష నిర్వహించారు. ఇళ్ల నిర్మాణాలను లబ్ధిదారులు త్వరితగతిన నిర్మించుకునేలా అవగాహన కల్పించాలని ఆయన అధికారులకు సూచించారు. ఎంపీడీఓ మహబూబ్ దౌలా పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం

మహానంది: సీతారామాపురం గ్రామానికి చెందిన శ్రీనివాస ఆచారి అదృశ్యమైనట్లు పోలీసులు బుధవారం కేసు నమోదు చేసుకున్నారు. ఎస్ఐ రామ్మోహన్‌రెడ్డి తెలిపిన వివరాలు.. 50 ఏళ్ల వయసున్న శ్రీనివాస ఆచారి గత నెల 24 నుంచి కనిపించడం లేదని భార్య మహేశ్వరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపట్టామన్నారు.

రంగనాథా..

కమిటీ నియామకం జరిగేనా?

- ఏటా ఫెస్టివల్ కమిటీతోనే తర్తూరు జాతర నిర్వహణ
- రూ.లక్షల ఆదాయం ఉన్నా ఆలయ అభివృద్ధి శూన్యం
- జాతర అనంతరం ఆదాయ, వ్యయాలను వెల్లడించని అధికారులు, కమిటీ


తర్తూరు శ్రీలక్ష్మీరంగనాథస్వామివారి ఆలయం

జూపాడుబంగ్లా: రాష్ట్రవ్యాప్తంగా పేరొందిన తర్తూరు లక్ష్మీరంగనాథస్వామి ఆలయానికి దేవదాయశాఖ ఉన్నతాధికారులు శాశ్వత కమిటీని నియమించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఏటా తాత్కాలిక ఉత్సవ కమిటీతోనే జాతరను నిర్వహించి చేతులు దులుపుకుంటుండటంతో భక్తుల నుంచి విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఫెస్టివల్ కమిటీ నియామకంలోనూ రాజకీయ నాయకుల పెత్తనం ఉంటుండటంతో ఎవరిది పైచేయి ఉంటుందో వారి అండదండలు ఉన్నవారికే చైర్మన్ పదవి లభిస్తోంది. భక్తిభావం ఉండి ఆలయాన్ని అభివృద్ధి చేయాలనే తలంపు ఉన్న భక్తులెవరికీ కమిటీలో సభ్యత్వం లభించట్లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ ఏడాది నూతనంగా ఎన్నుకున్న కమిటీ మరో నాలుగు రోజుల్లో తర్తూరు జాతర ప్రారంభం కానున్నా ఇప్పటి వరకు ఎలాంటి ఏర్పాట్లు చేయలేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.


శాశ్వత కమిటీ నియామకంతోనే అభివృద్ధి

స్వామివారి ఆలయం అభివృద్ధి చెందాలంటే శాశ్వత కమిటీని నియమించాల్సిన అవసరం ఎంతైనా ఉందని భక్తులు పేర్కొంటున్నారు. శాశ్వత కమిటీని నియమించడం వల్ల ఏటా స్వామివారికి వచ్చే ఆదాయ, వ్యయాలపై భక్తులకు కమిటీ సభ్యులు, అధికారులను నిలదీసేందుకు అవకాశం ఉంటుందని భక్తులు పేర్కొంటున్నారు. తాత్కాలిక కమిటీని నియమించడం వల్ల జాతర ముగిసిన వెంటనే కమిటీ చైర్మన్, సభ్యులు ఎవ్వరూ గుడి దరిదాపుల్లో కనిపించకపోవటం వల్ల స్వామివారి ఆదాయ, వ్యయాలపై ఎవరిని అడగాలో తెలియటం లేదని భక్తులు పేర్కొంటున్నారు.

లెక్కలు రంగనాథుడికే తెలుసు..

తర్తూరు లక్ష్మీరంగనాథస్వామివారి జాతర నిర్వహణ సందర్భంగా టెంకాయలు, లడ్డూప్రసాదాలు, కొబ్బరిచిప్పల వేలంతోపాటు హుండీలో భక్తులు సమర్పించిన కానుకల ద్వారా స్వామివారికి ఏటా సుమారు రూ.15 లక్షల ఆదాయం సమకూరుతోంది. జాతర అనంతరం స్వామివారికి వచ్చిన ఆదాయం ఎంత? వాటిలో దేనికెంత ఖర్చు చేశారు? మిగులు ఎంత ? అనే వివరాలను దేవదాయశాఖ అధికారులు, కమిటీ సభ్యులు వెల్లడించకపోవటంతో విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అంతా శ్రీరంగనాథుడికే తెలుసంటూ నిట్టూర్పుతున్నారు.

కళావిహీనంగా రంగనాథుని రథం



తర్తూరు లక్ష్మీరంగనాథుని రథోత్స వానికి తెలుగు రాష్ట్రాల్లో ఎంతో పేరుంది. అద్భుతమైన శిలాఖండాలతో స్వామివారి చరిత్రను వివరిస్తూ చెక్కిన శిల్పాలతో అద్భుతమైన రథాన్ని సుమారు 380 ఏళ్ల క్రితం చేయించారు. స్వామివారి రథాన్ని సంరక్షించేందుకు రథశాల నిర్మించినా తలుపులు ఏర్పాటుచేయకపోవటంతో ఎండకు ఎండి, వర్షానికి తడుస్తుండటంతో కళావిహీనంగా మారడంతో భక్తులు ఆందోళన చెందుతున్నారు.

అభివృద్ధి అంతంత మాత్రమే..

తర్తూరు జాతర సందర్భంగా శ్రీలక్ష్మీరంగనాథస్వామివారికి ఏటా రూ.7 లక్షల నుంచి రూ.10 లక్షల దాకా ఆదాయం వస్తోంది. దీనికితోడు ఆలయ భూములను వేలం వేయటం ద్వారా మరో రూ.2 లక్షల దాకా ఆదాయం సమకూరుతోంది. ఇలా ఏటా రూ.లక్షల ఆదాయం ఉన్నా ఆలయంలో చెప్పుకోదగిన అభివృద్ధి పనులు జరగడంలేదని భక్తులు పేర్కొంటున్నారు. భక్తులు ఇచ్చే విరాళాలతోనే ఇప్పటి దాకా ఆలయంలో కొంత మేర అభివృద్ధి పనులు చేపట్టారు.

ఆధార్ కేంద్రాలను సద్వినియోగం చేసుకోండి

జూపాడుబంగ్లా: మండలంలోని వివిధ గ్రామాల్లో గురువారం నుంచి రెండు రోజులపాటు నిర్వహించనున్న ప్రత్యేక ఆధార్‌కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ గోపికృష్ణ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ గురువారం తూడిచెర్ల, పారుమంచాల గ్రామాల్లో, శుక్రవారం జూపాడుబంగ్లా-2 గ్రామ సచివాలయాల్లో ప్రత్యేక ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. బాలఆధార్ నమోదుతోపాటు స్కూల్, కాలేజీ విద్యార్థులు, గ్రామస్తుల ఆధార్ నమోదు, మార్పులు, చేర్పులు చేయించుకోవాలన్నారు.

- బండిఆత్మకూరు: గురు, శుక్రవారాల్లో చిన్నదేవళాపురం, 8, 9, 10 తేదీల్లో జి.సి పాలెం, 11న ఈర్నపాడు గ్రామ సచివాలయాల్లో ఏర్పాటు చేయనున్న ప్రత్యేక ఆధార్ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ దస్తగిరి తెలిపారు.

రిజిస్ట్రేషన్ చేయించుకుంటేనే పథకాలు

మహానంది: ఫార్మర్స్ రిజిస్ట్రేషన్ చేయించుకుంటేనే సంక్షేమ పథకాలు అందుతాయని జిల్లా వ్యవసాయ అధికారి మురళీకృష్ణ తెలిపారు. మండల కేంద్రమైన ఎం.తిమ్మాపురంలోని సచివాలయంలో వ్యవసాయ, ఉద్యానశాఖల సిబ్బందితో బుధవారం సమావేశం నిర్వహించారు. డీఏఓ మురళీకృష్ణ మాట్లాడుతూ మహానంది మండలంలోని 11 రైతుల సేవా కేంద్రాల పరిధిలో తక్కువ పురోగతి ఉన్న గ్రామాల్లో 100 శాతం పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి నాగేశ్వరరెడ్డి, ఏఈఓ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పక్కాగృహాల లబ్ధిదారులకు అదనపు సాయం

- జిల్లా హౌసింగ్ పీడీ హరిగోపాల్


లబ్ధిదారులకు అవగాహన కల్పిస్తున్న జిల్లా హౌసింగ్ పీడీ హరిగోపాల్

ఆత్మకూరు: పక్కా గృహాలు నిర్మించుకుంటున్న లబ్ధిదారులకు ప్రభుత్వం అదనపు ఆర్థిక సాయం మంజూరు చేస్తున్నట్లు జిల్లా హౌసింగ్ పీడీ హరిగోపాల్ తెలిపారు. బుధవారం పట్టణంలోని పక్కాగృహాల లబ్ధిదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీ, ఎస్సీలకు రూ.50 వేలు, ఎస్టీలకు రూ.75 వేలు, చెంచు, గిరిజనులకు రూ.1లక్ష చొప్పున అదనంగా ఆర్థిక సాయం అందిస్తున్నట్లు చెప్పారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని గృహాలను త్వరగా నిర్మించుకోవాలన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ డీఈ నాగరాజు, ఏఈ ఉమామహేశ్వరరెడ్డి, వర్క్ ఇన్‌స్పెక్టర్లు నాయక్, సుబ్బలక్ష్మి పాల్గొన్నారు.

అలవి వలలతో చేపలు పడితే క్రిమినల్ కేసులు

- మత్స్యశాఖ జేడీ రాఘవరెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న మత్స్యశాఖ జేడీ రాఘవరెడ్డి

నందికొట్కూరు: అలవి వలలతో చేపలు పడితే క్రిమినల్ తప్పవని మత్స్యశాఖ జేడీ రాఘవరెడ్డి హెచ్చరించారు. రెవెన్యూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అలవి వలలతో చేపలు పడితే వలలను సీజ్ చేసి, లైసెన్సు రద్దు చేస్తామన్నారు. కృష్ణానదిలో ఏటా 17 లక్షల నుంచి 20 లక్షల వరకు చేప పిల్లలను వదులుతున్నామన్నారు. ఇక్కడ చేపల వేటతో నాలుగు వేల మంది మత్స్యకారులు జీవనం సాగిస్తున్నారన్నారు. సమావేశంలో తహసీల్దార్ శ్రీనివాసులు, ఏడీ శ్యామల తదితరులు పాల్గొన్నారు.

8న మండల సర్వసభ్య సమావేశం

మహానంది: ఈనెల 8న మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ మహబూబ్ దౌలా తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఎంపీపీ బుడ్డారెడ్డి యశస్విని అధ్యక్షతన జరిగే సమావేశానికి ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరు కావాలన్నారు.

రెండ్రోజులు ఆధార్ క్యాంపు

గాజులపల్లె రైల్వేస్టేషన్ గ్రామంలో రెండ్రోజుల పాటు ఆధార్ ప్రత్యేక క్యాంపు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ మహబూబ్ దౌలా తెలిపారు. 3, 4వ తేదీల్లో చెంచుకాలనీలో ఉన్న అంగన్ వాడీ కేంద్రంలో క్యాంపు ఉంటుందన్నారు. 6ఏళ్ల లోపు చిన్నారులకు నూతన ఆధార్ కార్డులు చేస్తారన్నారు.

వ్యాధుల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలి

నందికొట్కూరు: మలేరియా, డెంగీ వ్యాధుల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని మలేరియా జోనల్ అధికారి లక్ష్మీ నాయక్ సూచించారు. బుధవారం మిడుతూరు మండల పరిధిలోని కడుమూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. ఆస్పత్రిలోని గదులు పరిశీలించారు. మలేరియా, డెంగీ కేసుల వివరాలనుని డాక్టరును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోమలను అరికట్టే విధానంపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. దోమలను నివారించగలిగితే మలేరియా, డెంగీ వ్యాధులను అరికట్టవచ్చన్నారు. ఇళ్ల చుట్టూ నీరు నిల్వ లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్ఓ రంగన్న, హెల్త్ సూపర్‌వైజరు ఏసేపు, ల్యాబ్ టెక్నీషియన్ ఈశ్వర్ పాల్గొన్నారు.

పదవీ విరమణ తప్పని సరి

నందికొట్కూరు: ప్రతి ఉద్యోగికి పదవీ విరమణ తప్పని సరి అని ఎమ్మెల్యే జయసూర్య అన్నారు. బుధవారం పట్టణంలోని జెడ్పీ హైస్కూల్(కోటా) హెచ్ఎం సలీంబాషా పదవీ విరమణ సన్మాన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరయ్యారు. సన్మాన గ్రహీత దంపతులను ఎమ్మెల్యే ఘనంగా సన్మానించారు. ఆయా పాఠశాలల హెచ్ఎంలు పార్వతి, రాజేశ్వరి, లక్ష్మీప్రసన్న, ముజుహిద్ పాషా, అనిత జీవన్, గిరిధర్‌రెడ్డి, భరత్‌భూషణ్ పాల్గొన్నారు.

నేడు కొనుగోలు కేంద్రం ప్రారంభం

ఆత్మకూరు: పట్టణంలోని మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో గురువారం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించనున్నట్లు మండల వ్యవసాయాధికారి విష్ణువర్ధన్ రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఆధ్వర్యంలో కనీస మద్దతు ధరకు కంది, మినుము, శనగలను కొనుగోలు చేస్తామన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నేరస్తులపై కఠినంగా వ్యవహరించాలి

- జిల్లా ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా


పోలీసుస్టేషన్ పరిసరాలను పరిశీలిస్తున్న ఎస్పీ

ఆత్మకూరు: నేరస్తులపై కఠినంగా వ్యవహరించాలిపై కఠినంగా వ్యవహరించాలని జిల్లా ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా సూచించారు. స్థానిక పోలీసుస్టేషన్‌ను బుధవారం ఆయన తనిఖీ చేశారు. సైబర్ నేరాలు, రహదారి ప్రమాదాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఆయన సిబ్బందికి సూచించారు. సీసీ కెమెరాల ఏర్పాటు, వాటి ఆవశ్యకతను ప్రజలకు వివరించి, ప్రధాన కూడళ్లలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకునేలా చైతన్యం చేయాలన్నారు. స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారుల పట్ల మర్యాదగా వ్యవహరించాలన్నారు. పెండింగ్ కేసుల దర్యాప్తును వేగవంతం చేయాలన్నారు. స్టేషన్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఆయన వెంట డీఎస్పీ రామాంజి నాయక్, సీఐలు రాము, సురేష్‌కుమార్ రెడ్డి ఉన్నారు.

పొగాకు షెడ్డు దగ్ధం


మంటలను అదుపుచేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

బండి ఆత్మకూరు: మండల పరిధిలోని సంతజూటూరు గ్రామంలో హెచ్‌పీ పెట్రోల్ బంకు వద్దనున్న పొగాకు షెడ్డు దగ్ధమైంది. గ్రామానికి చెందిన దూదేకుల అజహరుద్దీన్ 7.5 ఎకరాల పొలం కౌలుకు తీసుకుని పొగాకు సాగు చేశాడు. దిగుబడులను క్యూరింగ్ కోసమని షెడ్డు ఏర్పాటు చేసుకున్నాడు. షెడ్డులో నుంచి బుధవారం మధ్యాహ్నం మంటలు వస్తుండటంతో స్థానికులు గమనించి అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. వారు ఘనాస్థలానికి చేరుకుని పక్కనున్న షెడ్లకు మంటలు వ్యాపించకుండా అదుపు చేశారు. కాగా అగ్నిప్రమానికి కారణాలు తెలియాల్సి ఉంది. కాగా అగ్నిప్రమాదంలో దాదాపు రూ.8 లక్షల విలువైన పొగాకు కాలిపోయిందని రైతు ఆవేదన వ్యక్తం చేశాడు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

గోస్పాడు: నంద్యాల-కోవెలకుంట్ల రహదారిలో మండలంలోని ఒంటి వెలగల గ్రామ సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మార్కాపురం పట్టణానికి చెందిన గురునాథం కారులో ఉమాపతి నగర్‌కు వెళ్తుండగా వాహనానికి కుక్క అడ్డు వచ్చింది. దానిని తప్పించబోగా కారు అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న కాలువలో బోల్తా పడింది. ఈ ఘటనలో గురునాథం అక్కడికక్కడే మృతిచెందగా కారులో ఉన్న మరో వ్యక్తి స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య, కుమార్తె ఉన్నారు. ప్రమాదంపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకటప్రసాద్ తెలిపారు.

మహానందీశ్వరుడిని దర్శించుకున్న అధికారులు


వేదపండితుల ఆశీర్వచనం అందుకుంటున్న రిజిస్ట్రార్లు

మహానంది: మహానందీశ్వరుడి సన్నిధిలో ఏపీ హైకోర్టు రిజిస్ట్రార్లు నరసింహాచారి, హరినాథ్, రిటైర్డ్ రిజిస్ట్రార్ వేణుగోపాలరావు బుధవారం పూజలు నిర్వహించారు. దర్శనార్థం వచ్చిన వారికి ఆలయ ఇన్‌స్పెక్టర్ పి.సుబ్బారెడ్డి స్వాగతం పలికారు. వారు స్వామికి అభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన పూజలు చేశారు. దర్శనం అనంతరం స్థానిక అలంకార మండపంలో వారికి స్వామి, అమ్మవారి ప్రసాదాలు అందించి వేదాశీర్వచనం చేశారు.

రెవెన్యూ అంశాలపై ప్రత్యేక దృష్టి సారించండి

నంద్యాల: ఫ్రీ హోల్డ్ భూములు, రీ సర్వే, 22ఏ, జాతీయ రహదారుల భూ సేకరణ తదితర రెవెన్యూకు సంబంధించిన అంశాలపై ప్రత్యేక దృష్టి సారించి సమస్యలు పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి రెవెన్యూ అధికారులను ఆదేశించారు. బుధవారం జూమ్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జాయింట్ కలెక్టర్ సి. విష్ణుచరణ్‌తో కలిసి ఆర్డీఓలు, మండల తహసీల్దార్‌లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఫ్రీ హోల్డ్ భూములకు సంబంధించి కొత్తగా వస్తున్న అసైన్‌మెంట్‌పై వీఆర్ఓలు, సర్వేయర్లు, సంబంధిత సిబ్బందితో జిల్లా, మండల స్థాయిలో వర్క్ షాప్స్ నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ఆర్డీఓలను ఆదేశించారు. ఇంటిగ్రేటెడ్ రెన్యువబుల్ ప్రాజెక్టులకు సంబంధించి పెండింగ్ ఉన్న సమస్యలను పరిష్కరించాలన్నారు. అదే విధంగా నేషనల్ హైవే, రైల్వేకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న భూ సేకరణ అంశాలను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో డీఆర్ఓ రాము నాయక్, ఏఓ రవి కుమార్, కలెక్టరేట్ సెక్షన్ సూపరింటెండెంట్‌లు తదితరులు పాల్గొన్నారు.

మహా సభలను జయప్రదం చేయండి

బండి ఆత్మకూరు: తమిళనాడు రాష్ట్రంలోని మధురై నగరంలో 6వ తేదీ వరకు జరగనున్న సీపీఎం అఖిల భారత మహా సభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ నాయకులు రత్నమయ్య, డేవిడ్ కోరారు. బుధవారం పార్నపల్లి గ్రామంలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేదల అభ్యున్నతి కోసం సీపీఎం ఎన్నో పోరాటాలు చేసిందన్నారు.

క్రీడాకారుల నుంచి దరఖాస్తుల ఆహ్వానం

నంద్యాల(న్యూటౌన్): జిల్లాలో ఆసక్తి గల క్రీడాకారులు స్పోర్ట్స్ ఆఫ్ అథారిటీ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించే సిక్స్ వీక్స్ సర్టిఫికెట్ కోర్సుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా క్రీడాభివృద్ధి అధికారి రాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్స్ మే 6 నుంచి జూలై 2 వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ ద్వారా ఈనెల 14లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరింత సమాచారం కోసం సెల్: 87126 22576 నంబరును సంప్రదించాలన్నారు.

ఉత్తమ ప్రాజెక్టులను ఎంపిక చేస్తాం


ప్రాజెక్టులు పరిశీలిస్తున్న విద్యాశాఖాధికారులు

నంద్యాల(న్యూటౌన్): విద్యార్థులు తయారు చేసిన సైన్స్ ప్రాజెక్టుల్లో ఉత్తమ వాటిని రాష్ట్రస్థాయికి ఎంపిక చేస్తామని జిల్లా విద్యాశాఖాధికారి జనార్దన్‌రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని పురపాలక ఉన్నత పాఠశాలలో వ్యవస్థాపక మనస్తత్వ అభివృద్ధికి సంబంధించిన సైన్స్‌ప్రాజెక్టులను నిర్వాహకులు గోపాల్ అధ్యక్షతన ప్రదర్శించారు. ఈ కార్యక్రమానికి డీఈఓతో పాటు డిప్యూటీ డీఈఓ శంకరప్రసాద్, సైన్స్ జిల్లా కో ఆర్డినేటర్ కేవీ సుబ్బారెడ్డి, సుందరరావు హాజరయ్యారు. 42 పాఠశాలల విద్యార్థులు ప్రాజెక్టులు తయారు చేసి ప్రదర్శించారు. వీటిలో తొలి స్థానంలో అవుకు జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాల విద్యార్థినులు దీపిక, కీర్తి రూపొందించిన ప్రాజెక్టులు నిలవగా రెండు, మూడు స్థానాల్లో శిరివెళ్ల కేజీబీవీ విద్యార్థిని కరీమున్ సోనియా, ఆళ్లగడ్డ బాలికల ఉన్నతపాఠశాల విద్యార్థిని మేరీ శైలజ నిలిచారు. వీరిని విద్యాధికారులు అభినందించి రాష్ట్రస్థాయికి ఎంపిక చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎం అసద్దుల్లా పాల్గొన్నారు.

సమష్టి కృషితో గ్రామాల అభివృద్ధి


కొనుగోలు కేంద్రాన్ని ప్రారంబిస్తున్న ఎమ్మెల్యే జయసూర్య

కొత్తపల్లి: అధికారులు, ప్రజా ప్రతినిధుల సమష్టి కృషితో గ్రామాల అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే గిత్త జయసూర్య అన్నారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలోని సమావేశ భవనంలో ఎంపీడీఓ మేరి అధ్యక్షతన పీజీఆర్ఎస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా వ్యవసాయ శాఖ ఏడీఏ ఆధ్వర్యంలో కందులు, మినులు, శనగలకు కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేశారు. గ్రామ పంచాయతీకి మంజూరైన స్వచ్ఛభారత్ ట్రాక్టర్‌ను సర్పంచు లక్ష్మీదేవితో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఉమారాణి, ఐసీడీఎస్ ఏసీడీపీఓ మంగవల్లి, ఏఓ మహేష్, ఏపీఎం పుల్లయ్య, పశువైద్యాధికారి భువనేశ్వరి పాల్గొన్నారు.

రసవత్తరంగా రాష్ట్రస్థాయి ఎడ్ల పోటీలు



హోరాహోరీగా సాగుతున్న ఎడ్ల పోటీలు, విజేతగా నిలిచిన ఎడ్ల యజమానులకు మెమొంటో అందజేస్తున్న రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ పీపీ నాగిరెడ్డి తదితరులు

గోస్పాడు: శ్రీగుమ్మిత మల్లికార్జునస్వామి, శ్రీవీరభద్రస్వామి జాతరను పురస్కరించుకుని పామిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, శ్రీనివాసరెడ్డిల జ్ఞాపకార్థం బుధవారం గోస్పాడులో నిర్వహించిన రాష్ట్రస్థాయి ఎద్దుల బల ప్రదర్శన పోటీలు రసవత్తరంగా సాగాయి. రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ పీపీనాగిరెడ్డి ఈ పోటీలను ప్రారంభించి మాట్లాడారు. బండలాగే ఎద్దులను, ఒంగోలు జాతి పశు పోషకులను ప్రోత్సహించేందుకు ఏటా గ్రామంలో రాష్ట్రస్థాయి ఎద్దుల పోటీలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ పోటీల్లో ఆరు జతల ఎద్దులు పాల్గొనగా నంద్యాల జిల్లా శిరివెళ్ల మండలం గుంపరమానుదిన్నె గ్రామానికి చెందిన కందూరు రాంభూపాల్‌రెడ్డి ఎద్దులు 1,854 అడుగులు లాగి మొదటి స్థానం సాధించి రూ.60వేలు బహుమతి పొందాయి. నంద్యాల జిల్లా పాణ్యం మండలం ఎస్.కొత్తూరుకు గ్రామానికి చెందిన బీరాబుల్స్ ఎద్దులు 1,789 అడుగులు లాగి రెండో స్థానంలో నిలిచి రూ.40 వేలు సొంతం చేసుకున్నాయి. వైఎస్సార్ జిల్లా వైఎంఆర్ కాలనీకి చెందిన గురివిరెడ్డి, అనంతపురం జిల్లా గన్నివారిపల్లె కాలనీకి చెందిన ఎద్దులు 1,647 అడుగులు లాగి మూడో స్థానం సాధించి రూ. 30 వేలు గెలుపొందాయి. బాపట్ల జిల్లా బల్లికురువ గ్రామానికి చెందిన పీవీఎస్ఆర్ బుల్స్ పావులూరి వీరస్వామి ఎద్దులు 1,503 అడుగులు లాగి నాలుగో స్థానంలో నిలిచి రూ.20 వేలు సొంతం చేసుకున్నాయి. అలాగే, నంద్యాల జిల్లా ఇసుకపల్లె గ్రామానికి చెందిన సిద్దయ్య ఎద్దులు, అనంతపురం జిల్లా గన్నివారి పల్లెకు చెందిన రమేష్‌బాబు ఎద్దులు వరుసగా ఐదు, ఆరు స్థానాలు సాధించడంతో కి రూ. 5వేల చొప్పున నిర్వాహకులు నగదు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు చిన్ననాగిరెడ్డి, ఉప మండల అధ్యక్షుడు జనార్దన్‌రెడ్డి, మాజీ మండల అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, సోషల్ మీడియా రాష్ట్ర అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, రిటైర్డు వీఆర్ఓ ఉమామహేశ్వరరావు, గ్రామపెద్దలు తదితరులు పాల్గొన్నారు.